
# పొగబండి కథలు

ఓలేటి శ్రీనివాసభాను




# ఏరు పొంగింది

ఎవరో గట్టిగా కుదిపినట్లు లేచాడు సూరయ్య.
పీడకల వచ్చినట్లు ఉలికి పడ్డాడు.
''ఓర్నాయనో ఏటిలా జరిగిపోనాది. ఎంత పనైపోనాది'' పక్కలో
పిడుగు పడినట్లు గట్టిగా అరిచాడు.
కళ్లు నులుముకుని, వాచీ చూసిన సూరయ్యకి గుండె గుభేల్మంది.
తను డ్యూటీకెళ్లాల్సిన టైము దాటి అప్పటికే అరగంట పైబడింది.
''నాను పీకలమొయ్యా తాగేసేను. మొద్దు నిద్రపోనాను. సరే-
ఇంట్లో జనాలంతా ఏమైపోనార్రా?ఏట్లో కలిసిపోనారా... వల్లకాట్లో
బుగ్గయిపోనారా? ఆఁ..!'' కుటుంబ సభ్యుల మీద కేక లేశాడు.

అలా కేకలేస్తూనే పెరట్లోకొచ్చి, గోలెంలోని నీళ్లలో దోసిళ్లు ముంచి, మొహానికేసి రుద్దుకున్నాడు. మొహం తుడుచుకోకుండానే కంగారుగా గదిలోకి వచ్చి, గోడ మీద మేకుకు తగిలించిన యూనిఫాం వేసుకున్నాడు. నైట్ పెట్రోలింగ్‌కి అవసరమైన కిట్ బ్యాగ్‌ని తెరిచి, మొత్తం సరంజామా ఉందో లేదో సూరయ్య సరి చూసుకున్నాడు. హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్‌లో కిరోసిన్ నింపి వెలిగించాడు. నల్ల తాడుకి కట్టిన కప్పలాంటి ఇత్తడి విజిల్‌ని మెళ్లో వేసుకొని గుమ్మం దాటాడు. ఏదో గుర్తుకొచ్చింది. మళ్లీ ఇంట్లోకెళ్లాడు. ''అసలే వానా కాలం. ఎందుకేనా మంచిది...సెయ్యికాపుకి ఇవుండాల'' అనుకుంటా రెయిన్‌కోటు తొడిగేసుకొని, చంకలో గొడుగుపెట్టుకుని-

''నైట్ పెట్రోలింగ్ డ్యూటీకి ఎళ్తన్నాను. తలుపేసుకో'' అంటూ ఇంట్లో వినిపించేలా కేకేసి, వీధిలోకొచ్చాడు సూరయ్య.

''ఇదేటి... ఈ పొద్దు ఇలాగైపోనాదేటి... డ్యూటీకెళ్లకుండా తొంగుండిపోనానేటి? అసలే వానాకాలం. రాత్రీ పగలూ గస్తీ తిరగాల. పెట్రోలింగ్ డ్యూటీలు సెయ్యాల. నూటనాలుగో కిలోమీటరు కాడ ఏరు పొంగిందంటే అంతే సంగతులు. అసలే అది దొంగేరు. సడీ సప్పుడూ సెయ్యదు. పెద్ద పులినాగ పడిపోతాది. నిరుడు మూడుసార్లు పొంగి



పోనాది. మొత్తం ట్రాక్‌నీ, టూడౌన్ పాసింజర్‌నీ కొట్టుకుపోనాది...''

గతాన్ని తలుచుకుంటూ భయంగా కదిలాడు సూరయ్య. వాచీ చూసుకున్నాడు.

''టూ డౌన్ పాసింజర్‌కి లైన్ క్లియర్ ఇచ్చేసుంటారు. దానికి ఎనకే టూనాట్ టూ మెయిలు. మరో గంటకే ఫోర్ నాట్ ఫోర్ ఎక్స్‌ప్రెస్సు. ఈ రాత్రి వేళ ఏరు పొంగిందంటే ఏం గావాల! జనా లేమై పోవాల!''

డొంక దారిలో సూరయ్య పరుగు లంకించు కున్నాడు. ఆ కంగారులో దారికి అడ్డంగా నిద్ర పోతున్న ఓ కుక్కని డొక్కలో తన్నాడు. అది కోపంతో 'భౌ'మనలేదు. బాధతో 'కుయ్ఁ' మంది. పక్కనే మోతుబరిగారి కళ్లం. కళ్లంలోని పంటకుప్ప లకి కాపలా కాస్తూనే కాలకృత్యం తీర్చుకోవాలని వాసన చూస్తోంది. సూరయ్య కిర్రు చెప్పుల్ని, కర్ర చప్పుడునీ విని, కాలుతో పాటు మెడను కూడా పైకెత్తి గట్టిగా అరిచింది.

సూరయ్య పట్టించుకోలేదు. గబగబా అడుగులు వేస్తూ గట్టెక్కాడు. రైలు దారిని చేరుకున్నాడు. ఊపిరి తీసుకొని ఆకాశం వైపు చూశాడు, భయం వేసింది. దూరంగా ఆకాశం అంచులు- తారు పులిమిన వెన్ను పట్టీల్లా వున్నాయి. వాటికి పొగ మూటల్లాగా మబ్బులు వేలాడుతున్నాయి. రొజ్జగాలి కొడుతోంది. అందులోంచి మట్టివాసన పలచగా వస్తోంది.

''అమ్మో.....'' అరచేతిని గుండె మీద వేసుకుంటూ ట్రాక్ మీంచి పరుగు తీశాడు సూరయ్య.

వాన రావడం ఖాయం. ఎగువన కొండల్లో చినుకుపడిందంటే పల్లం వైపు నీరు పరుగులు తీస్తుంది. మన్ను తిన్న పాములా నిద్రపోతున్న దొంగేరు ఒక్కసారి పుంజుకుంటుంది. పుంజీలు తెంపుకుంటూ పరుగులు పెడుతుంది. దానికి దూకుడే తప్ప దయలేదు. కలబడి పోవడమే తప్ప కన్నీళ్ల గురించి ఆలోచించే గుండె లేదు.

నిరుడు ఏం జరిగింది?

అర్ధరాత్రి విరుచుకుపడి టూ డౌన్ ప్యాసింజర్ బోగీల్నీ, ప్యాసింజర్ల ప్రాణాల్ని కొట్టుకుపోయింది. ఎందరి ఉసురుపోసుకుంది. ఎన్ని కుటుంబాల్ని వీధిలోకి తోసింది.

ఏడాది గడిచినా, నిన్ననే జరిగినట్లుంది పెట్రోల్ మేన్ సూరయ్యకి!

కళ్లు మూసుకుంటే ఏరు....

కళ్లు తెరిస్తే కన్నీరు...

మబ్బుల్ని చూస్తూనే సూరయ్య నూటనాలుగో కిలో మీటరు వైపు దూసుకుపోయాడు.

''టప్...టప్...'' రూపాయి బిళ్లంత చినుకులు.

''ఈ పాటికి దొంగేరు పుంజీలు తెంపుకుని ఉంటాది. దాన్ని ఆపడం ఎవుడి వసెం? నూట్నాలుగో కిలోమీటరు... టూడౌను ప్యాసింజరు....''

పరుగు పెట్టాడు సూరయ్య

ఓ చేతిలో గొడుగు.... మరో చేతిలో హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్ కాళ్లకు అడ్డం పడుతూ... రాళ్లూ, స్లీపర్లూ, రెయిన్‌కోటు అంచులూ....

ట్రాక్ మలుపులు తిరుగుతోంది. సూరయ్యలో అలసట పెరుగుతోంది. కళ్లలో భయం రెచ్చిపోతోంది. కాళ్లలో సత్తువ చచ్చిపోతోంది. దేవుడు మనిషికి ఏడు జన్మలిస్తాడంటారు. అలాగే జన్మించిన ప్రతీసారీ పెట్రోల్ మేన్‌కి ఏడేసి కళ్లు, కాళ్లూ, చేతులూ ఇస్తే బాగుణ్ను. దొంగేరు నుంచి పట్టాల్నీ, పొగబళ్లనీ,ప్యాసింజెర్లనీ కాపాడుకోవచ్చు.

సూరయ్యలో ఏవేవో ఆలోచనలు.

దూరంగా అల్లదిగో నూటనాలుగో కిలోమీటరు.

''ఈ పాటికి దొంగేరు వచ్చేసుంటాది. ట్రాక్ లేసిపోయి వుంటాది...''సూరయ్యలో భయం కట్టలు తెంచుకొంది. అంతలో ''గయ్ఁ'' మంటూ కెనెడియన్ ఇంజన్ కూతని గాలి మోసుకొస్తోంది. అది టూడౌన్ పాసింజరేననీ... వెనక నుంచే వస్తోం దనీ సూరయ్య గుర్తించాడు. ముందుకు వెళ్తే నూట నాలుగో కిలోమీటరు.. వెనక వైపు టూడౌన్ ప్యాసింజరు. ఎటు వెళ్లాలి? ముందుకా.. వెనక్కా? వెనక్కే తిరిగాడు. పెట్రోల్ మేన్ సూరయ్య.

హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్ ఎర్ర గ్లాసులోకి మార్చాడు. టూడౌన్ ప్యాసింజరు నూట నాలుగో కిలోమీటరుకి చేరకముందే, దొంగేరు వాత పడక ముందే-నడిమధ్య అడ్డుకోవాలి. 'డెడ్ స్టాప్' చేసెయ్యాలి.

ఎర్రదీపాన్ని గాల్లో ఊపుతూ... కప్పలాంటి ఇత్తడి విజిల్‌ని గట్టిగా ఊదుతూ... ట్రాక్ మీద పరుగు తీశాడు సూరయ్య.

అలా పరిగెడుతూ అమాంతం ముందుకు తూలిపడ్డాడు. పడ్డ మనిషి లేవలేకపోయాడు. హ్యాండ్ సిగ్నల్ ల్యాంప్ పట్టాల మీద పగిలింది. ఓ స్లీపర్ మీద ఒలికిన కిరోసిన్ భగ్గున మండింది.

పది గజాల దూరంలో ఓ పొగబండి ఆగింది....

అది టూడౌన్ ప్యాసింజరు కాదు..... ఓ గూడ్సు బండి....

ఇంకా చెప్పాలంటే అది రాత్రి వేళ కాదు. వర్షాకాలం కూడా కాదు. ఎండ మండిపోతోంది. చినుకు పడాలని నేలతల్లి ఆరాటపడుతోంది.

అలాంటి మధ్యాహ్నం వేళ మండుటెండలో ట్రాక్ మీద పడిపోయిన సూరయ్యని గూడ్సుబండి ఇంజన్‌లోంచి కిందికి దిగిన ఫైర్‌మేన్లు మోసుకొచ్చారు. ఇంజన్‌లోకి చేర్చారు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లోని ఆయింట్‌మెంట్‌ని తీసి తల మీద గాయానికి రాసి కట్టుకట్టారు.

సూరయ్యని చూసి వాళ్లు ఆశ్చర్యపోలేదు. జాలి పడ్డారు.

రాత్రికీ పగలుకీ తేడా తెలీకుండా మతి భ్రమించిన సూరయ్య ట్రాక్ మీదపరుగులు తీయడం, పొగబళ్లకి అడ్డపడడం మామూలే!

కానీ, అతను అలా ప్రవర్తించడానికి కారణం మాత్రం మామూలుది కాదు. మహా ఘోరమైంది.

ఏడాది క్రితం... ఓ రాత్రి వాన పడింది. ఏరు పొంగింది. నూటనాలుగో కిలోమీటరు దగ్గర ట్రాక్‌ని 'ఫ్లాష్ ఫ్లడ్' కొట్టుకుపోయింది. అదే సమయంలో ట్రాక్ మీదున్న టూడౌన్ ప్యాసింజరు మున్నీటిలో పడి, నిద్రపోతున్న ప్రయాణికుల్ని జల సమాధి చేసింది. అలా సమాధి అయిన వారిలో సూరయ్య భార్య వుంది. పదేళ్ల కొడుకూ, ఏడేళ్ల కూతురూ వున్నారు.

ఆ సమయానికి నైట్ పెట్రోలింగ్ డ్యూటీలో వున్న సూరయ్య మాత్రం దూరంగా ట్రాక్ పక్క చీకట్లో పడున్నాడు. అతని డ్యూటీ కిట్‌బ్యాగ్‌లోని ఖాళీ సీసాలో కాసిన్ని సారా చుక్కలు మిగిలిపోయాయి.

*



## దీపిక ఓపిక!

దీపికా పదుకొనే తన కెరీర్‌తో ఎంత బిజీగా ఉన్నా, రన్‌బీర్ కపూర్ గర్ల్‌ఫ్రెండ్‌గా తన బాధ్యతలు నిర్వహించడంలో ఏ మాత్రం అలసత్వం చూపించటం లేదు! అతను కత్రినా కపూర్ సరసన నటిస్తున్న చిత్రం షూటింగ్‌కు దీపికా పదుకొనే పనేం లేకపోయినా హాజరవుతూనే ఉందట. మొన్నో రోజు ఆమె అతణ్ణి ఆశ్చర్యపరుద్దామని చెప్పా పెట్టకుండా షూటింగ్‌కి వచ్చేసింది. అయితే అప్పుడు అతను హీరోయిన్ కత్రినా కైఫ్‌తో ఏదో పార్టీకి వెళ్ళాడట. అతను వచ్చేవరకు ఓపిగ్గా అక్కడే నిరీక్షించిందట. అంతేకాదు, రన్‌బీర్ కపూర్ నటిస్తున్న 'వేక్ అప్ సిడ్' షూటింగ్‌లో అతని కాలి బొటన వేలు కాస్త చిట్లింది. వెంటనే ఆమె తరలి వచ్చేసి, దగ్గరుండి సపరిచర్యలు చేసింది. ఒక పక్క తన షూటింగ్‌లలో పాల్గొంటూ, మరో పక్క తన బాయ్ ఫ్రెండ్ షూటింగ్‌లకు హాజరవుతూ ఆమె సమయాన్ని ఎలా మేనేజ్ చేస్తుందో అర్థం కావటం లేదు చూసిన వారికి.